తొలి సమావేశంలోనే బీసీ బిల్లు ఆమోదించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాన మంత్రిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన నరేంద్రమోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేయడం బీసీలందరికీ గర్వకారణమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తొలి పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో రిజర్వేషన్ అమలు చేసి బీసీల డిమాండ్ నేరవేర్చాలని కోరారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ, మంత్రులకు తమ సంఘం తరపున అభినందనలు తెలిపారు. రాబోయే అయిదేళ్లలో బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు, వాటికి బడ్జెట్ కేటాయించాలని మోదీని కోరారు. బడ్జెట్‌లో జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం త్వరలో మోదీ, కేంద్ర మంత్రులను కలిసి తమ డిమాండ్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి చీరలు, శానిటైజర్స్ పంపిణీ చేస్తున్న దేవిరెడ్డివిజితారెడ్డి

శానిటేషన్ సిబ్బంది సేవలు భేష్

బర్కత్‌పుర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న కృషి మరువలేనిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. శానిటేషన్ సిబ్బంది నిరంతరం పనిచేయడంతోనే ప్రధాన రహదారులు, బస్తీలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. పరిశుభ్రతకు వారు చేస్తున్న కృషిని అభినందిస్తూ కూచికుల్ల విమలాసుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక వైస్ చైర్మన్ శ్వేతారెడ్డి ఆధ్వర్యంలో బర్కత్‌పురలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి చీరలు, శానిటైజర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విమలాసుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని, గ్రామాలకు విస్తరింపచేయాలన్నారు. సేవా భావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సుశీల తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, రచయిత డాక్టర్ ప్రతిభాలక్ష్మి తదితరులు

చేత (తు)ల్లో ఆరోగ్యం పుస్తకావిష్కరణ

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి రచించిన చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మానవ జీవిత కాలం పెరుగుతున్న క్రమంలో ఎదురవుతున్న అనేక దీర్ఘకాలిక జబ్బుల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులకు అర్థమయ్యే సరళమైన తెలుగు భాషలో చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రమణి మాట్లాడుతూ ఈ పుస్తకం ఇంట్లో ఉంటే డాక్టర్ ఉన్నట్లేనని అన్నారు. తెలంగాణ ఆయూష్ మాజీ అదనపు సంచాలకులు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం గురించి ఉండే అనేక సందేహాలకు వైద్యులు అందించాల్సిన సలహాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మన చేతల్లోనే మన ఆరోగ్యం ఉంటుందని తెలియజేసే ప్రయత్నమే ఈ పుస్తకామన్నారు. కార్యక్రమంలో నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో మెరిసిన నగర క్రీడాకారుడు

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ ఫెడరేషన్ ఇండియా, నీలేష్ రాణే యువ ప్రతిష్టాన్ ముంబాయి, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ ప్రమోషన్ అసోసియేషన్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 6వ ఎస్‌డీపీఎఫ్ నేషనల్ చాంపియన్‌షిప్ - 2024 షటిల్ - బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలో నగరంలోని పార్శీగుట్ట ఈస్ట్‌మున్సిపల్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అడిక్‌మెట్ షటిల్ క్రీడాకారుడు భావనక ధృవసాయి(20) పాల్గొని సింగిల్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. టోర్నమెంట్‌లో ఏడుగురు క్రీడాకారులతో తలపడి ఫైనల్‌లో కర్నాటక క్రీడాకారుడు సామ్రాట్‌ను తొలి మ్యాచ్‌లో 21- 19, రెండవ మ్యాచ్‌లో 21 - 18 స్కోర్‌తో గెలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ గోల్డ్ మెడల్‌ను ముంబాయి ఇన్‌కామ్ టాక్స్ విభాగం జాయింట్ కమిషనర్ డాక్టర్ రవిరాజ్ కగోరే, నాసిక్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆదిత్య మిర్కేహేల్కేర్‌ల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అడిక్‌మెట్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో భావనక ధృవసాయిని సన్‌రైజర్స్ షటిల్ అసోసియేషన్ తరపున సత్కరించారు. ఈ సందర్భంగా భావనక ధృవసాయి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఈ గోల్డ్‌మెడల్ రావడం సంతోషంగా ఉందని ఈ మెడల్ తనకు మరింత ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధిస్తానన్నారు. తల్లిదండ్రులు అపర్ణ, నాగేష్‌లు మాట్లాడుతూ తమ కుమారుడు గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.



నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

గోల్నాక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా మోదీ పదేళ్లలో దేశాన్ని ఎంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని, దేశ ప్రజలు మోదీ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసంతో హ్యాట్రిక్ ప్రధానిగా పట్టం కట్టారని అన్నారు.

కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్‌పేట నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.అనిల్‌చారి, నాయకులు పి.రామస్వామి, కె.లక్ష్మీకాంత్‌గౌడ్, దిలిప్‌శర్మ, జి.రమేష్‌గౌడ్, జి.దేవేందర్, పి.వెంకటరమణ, తిరుపతి, ఎం.విజయ్, పి.విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రత్నాకరశర్మ సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పత్రికా విలేకరిగా సుదీర్ఘకాలం పని చేసి తర్వాత ఆధ్యాత్మిక జీవనంతో ముందుకు సాగిన రత్నాకరశర్మ సేవలు చిరస్మరణీయమని జవహర్ బాలభవన్ మాజీ డైరెక్టర్ డా. ఎం.కె. రాము అన్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీ సెంటర్‌లో ఇటీవల మరణించిన రత్నాకరశర్మ సంస్మరణ సభను సచ్చిదానందకళాపీఠం వారు నిర్వహించారు. రాము మాట్లాడుతూ సచ్చిదానంద కళాపీఠం స్థాపించిన శర్మ ఎందరో బాలబాలికలను సంగీత, నృత్యకళాకారులుగా సమాజానికి అందించారన్నారు. పలువురు జర్నలిస్టులు ఈ సందర్భంగా శర్మ స్నేహస్వభావంను గుర్తుచేశారు. వెంకటేష్, ప్రసాద్, మేడిపల్లి యాదగిరి, హరిణి, మయూరి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టులకు ఎదురుచూపులు



- **న్యాయం చేయాలంటున్న కాంగ్రెస్ నేతలు**

బర్కత్‌పుర/నల్లకుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారని బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గోల్నాక డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన కొంత మంది నేతలకు నామినేటెడ్ పోస్టులతో న్యాయం చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఎంపీ ఎన్నికలు పూర్తి కావడంతో ఈ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్‌యాదవ్, యువజన కాంగ్రెస్ గ్రేటర్ అధ్యక్షుడు మోత రోహిత్‌లకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం సమావేశంలోనే ఆనాడు ప్రకటించారు. వారితోపాటు మరి కొంత మంది నేతలు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, పుల్లా నారాయణస్వామి, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శులు శంభుల శ్రీకాంత్ గౌడ్, ఎన్.అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు అభిజిత్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, మేదర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, తొలుపునూరి కృష్ణగౌడ్ సీ.హెచ్. మురళీకృష్ణ తదితరులు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. నాయకులు తమ బయోడేటాలను సమర్పిస్తూ తమకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారు. నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆశీస్సులు ఎంత మందికి ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

ఆర్థిక లావాదేవీల వివాదం

ఓ వ్యాపారిపై దాడి, కిడ్నాప్

- **కొన్ని గంటల్లోనే అడ్డాకులలో పట్టివేత**

నార్సింగ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన గోల్డ్, ఎలక్ట్రానిక్ వ్యాపారం చేసే వ్యక్తిని ఆర్థిక లావాదేవీల కారణంగా కర్నూల్‌కు చెందిన వారు దాడి చేసి మరీ కిడ్నాప్ చేశారు. నార్సింగ్ పోలీసులు కొన్ని గంటల వ్యవధిలో నిందితులను మహబూబ్‌నగర్ పోలీసుల సహాయంతో పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆదివారం సాయంత్రం వెల్లడించారు. హైదర్షాకోట్ పోర్ట్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే శేషవర్ధన్‌రెడ్డి(37) బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారం చేస్తుంటాడు. ఈయనకు కర్నూల్ నందికొట్కూరుకు చెందిన అందె క్రాంతి కుమార్(36), పి.సందీప్(36)తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో శేషవర్ధన్‌రెడ్డి తన బిజినెస్ పార్ట్‌నర్ సుష్మితకు చెందిన మారుతీ ఎస్‌క్రాస్ కారు (టీఎస్07హెచ్‌ఏ1221)లో వెళ్తుండగా నార్సింగ్ రోటరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆపారు. శేషవర్ధన్‌రెడ్డిపై దాడిచేసి మరో కారులో ఎక్కించుకొని వెళ్తుండగా నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చి కారును తనిఖీ చేస్తుండగా రాత్రి 10 గంటల ప్రాంతంలో శేషవర్ధన్‌రెడ్డి భార్య అరుణకు ఫోన్ వచ్చింది. ఆమె నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కిడ్నాపర్లు కారులో శేషవర్ధన్‌రెడ్డిని తీసుకొని కర్నూల్ వైపు వెళ్తున్నట్లు నార్సింగ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మహబూబ్‌నగర్ పోలీసులను అలర్ట్ చేయగా, వారు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టారు. అడ్డాకుల టోల్‌గేట్ వద్ద కిడ్నాపర్లు మహబూబ్‌నగర్ పోలీసులకు చిక్కారు. గతంలో వీరు ఏసీల బిజినెస్ కూడా కలిసి చేశారని పోలీసులు గుర్తించారు. శేషవర్ధన్‌రెడ్డిని సురక్షితంగా అడ్డాకుల పోలీసుల సహాయంతో రక్షించగలిగామని నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్, ఇన్ స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. వ్యాపార లావాదేవీలను న్యాయపరంగా కోర్టు నుంచి పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్, సీఐ హరికృష్ణారెడ్డి

రామోజీరావుకు పీఆర్‌ఎస్‌ఐ సంతాపం

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల పాటు అప్రతిహతంగా నాణ్యమైన సమాచారం ప్రసారం చేసిన మీడియా దిగ్గజం చెరుకూరి రామోజీరావు మృతికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీఆర్‌ఎస్‌ఐ చైర్మన్ ఎస్.రాము మాట్లాడుతూ ఆధునిక జర్నలిజంలో ఎన్నో మార్పులకు రామోజీరావు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యదర్శి కంభంపాటి యాదగిరి మాట్లాడుతూ రామోజీ తెలుగు జాతికి చేసిన సేవలు మరువలేమని పేర్కొన్నారు. వాకిటి మధు, శ్రీనివాసరావు, కృష్ణ బాజీ, రాజేష్, మోహన్‌రావు, సుబ్బారావు తదితరులు రామోజీరావుతో సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు

(1వ పేజీ తరువాయి)

చెల్లించిన అనంతరం రోడ్డు తవ్వేందుకు అనుమతినిస్తారు. పనులు పూర్తయిన అనంతరం జీహెచ్‌ఎంసీ పునరుద్ధరణ పనులు చేపడుతుంది. ఈ విషయంలో వాటర్‌బోర్డుకు మినహాయింపునిచ్చారు. ఇంజనీరింగ్ వ్యవస్థ ఆ విభాగంలో కూడా ఉండడంతో కొద్ది మేర రోడ్డు తవ్వే పనులకు సంబంధించి పునరుద్ధరణ పనులు చేసే బాధ్యత బోర్డుకు అప్పగిస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే, చాలా ప్రాంతాల్లో బోర్డు అధికారులు రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదు. లీకేజీల అరెస్టు, పైపులైన్ల మార్పు కోసం రహదారులు తవ్వి వదిలేస్తున్నారు. సకాలంలో పునరుద్ధరణ పనులు చేయని పక్షంలో సంబంధిత అధికారుల నుంచి జీహెచ్‌ఎంసీ వివరణ కోరే అవకాశముంది. అయినా బల్దియా బాధ్యత విస్మరిస్తోంది.



రాంనగర్‌లోని సామ్య ఆస్పత్రి పక్క వీధిలో తవ్వి వదిలివేసిన రోడ్డు

ఎన్నికల కోడ్ వల్లే : జీహెచ్‌ఎంసీ అధికారి...

ఎన్నికల కోడ్ ఉండడం వల్లే పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన నేపథ్యంలో రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారొకరు చెప్పారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టవద్దు.. మరమ్మతు, నిర్వహణ పనులు చేసే అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

గ్రేటర్ విద్యుత్ వ్యవస్థ మరింత బలోపేతం

- **స్కాడా పరిధిలోని లైన్స్‌విభాగం ఆపరేషన్ విభాగం పరిధిలోకి..**
- **రెండు, మూడు రోజుల్లో తుది నివేదిక**

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. మెట్రోజోన్ పరిధిలో విద్యుత్‌లైన్ల విభాగాన్ని ఆపరేషన్ వింగ్ పరిధిలోకి తీసుకువచ్చే దిశగా డిస్కం కసరత్తు ప్రారంభించింది. గ్రేటర్‌జోన్‌లో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటూ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డిస్కం ఓ కమిటీని నియమించింది. ప్రస్తుతం స్కాడా ఎస్ఈ పరిధిలో పనిచేస్తున్న లైన్స్ విభాగం డీఈలు ఆపరేషన్స్ ఎస్ఈల పరిధిలోకి తీసుకువచ్చే దిశగా కమిటీ ప్రాథమికంగా సూచించింది. ఇద్దరు సీజీఎంలు, ముగ్గురు ఎస్ఈలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీకి ఇప్పటికే ఓ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన సీఎండీ కమిటీకి పలు సూచనలు చేయడంతో పాటు తుది నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో మెట్రోజోన్‌లో చేపట్టబోయే మార్పులు, జోన్లు, సర్కిళ్ల పునర్విభజనపై పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కొత్తగా బస్ రూట్లు.. నెలవారీ పాస్‌లు.!

- **ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు**
- **టీజీఎస్‌ఆర్టీసీగా బస్‌పాస్ వెబ్‌సైట్ మార్పు**



హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కొత్త బస్‌రూట్లు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆదాయం పెంచుకునేందుకు ఏసీ బస్సుల్లో రూట్ బస్‌పాస్‌లు, చార్జీలు తగ్గించి నెల వారీ పాస్‌లను గ్రేటర్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఏసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెంచి అదనపు ఆదాయం తెచ్చేకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా పుష్పక్ ఏసీ బస్సుల్లో మొదటిసారిగా రూట్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. శంషాబాద్-ఎయిర్‌పోర్ట్‌లో శంషాబాద్, ఆరాంఘర్, బాలాపూర్, గచ్చిబౌలి నుంచి రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టుకు ప్రయాణించేవారి కోసం రూట్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చారు. అదే తరహాలో గ్రీన్‌మెట్రో లగ్జరీ ఏసీ బస్సుల్లో రూ. 1,900కే నెల వారీ బస్‌పాస్ ప్రవేశపెట్టారు. ఈ పాస్ ధర మే వరకు రూ.2,530 ఉండగా రూ.630 తగ్గించి బస్‌పాస్‌ల సంఖ్య పెంచే దిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. విద్యార్థుల బస్‌పాస్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేసే http://mis.tsrtcpass.in అనే వెబ్‌సైట్ కూడా http://mis.tgsrtcpass.comగా మార్చినట్లు గ్రేటర్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

కూచిపూడి రంగప్రవేశం





ప్రముఖ దంత వైద్యులు ఎం.ఎస్ గౌడ్ మనుమరాళ్లు, కీర్తి, వికాస్‌గౌడ్ దంపతుల కూతుళ్లు త్రిఖగౌడ్, మిష్కగౌడ్ ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికగా కూచిపూడి రంగప్రవేశం చేశారు. నృత్య ప్రదర్శన ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. కూచిపూడి నాట్యగురువు జ్యోతిరెడ్డి పర్యవేక్షణలో గౌడ సిస్టర్స్ రంగ ప్రవేశానికి ప్రముఖ సినీనటుడు సుమన్, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, కేవీ రమణాచారి, తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సాయిబాబాగౌడ్, భారతీయం సత్యవాణి, నృత్య విమర్శకుడు జీవీ అన్నారావు తదితరులు హాజరయ్యారు.

నగరంతో కిషన్‌రెడ్డి మమేకం

(1వ పేజీ తరువాయి)

రోడ్ షోలు విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు.

అంబర్‌పేటతో అనుబంధం

గంగాపురం కిషన్‌రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రి స్థాయికి ఎదిగినా అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉంది. పూర్వ హిమాయత్‌నగర్‌లో ఒకసారి, పునర్విభజనలో అంబర్‌పేటగా ఏర్పడిన తర్వాత రెండుసార్లు ఆయన విజయం సాధించారు. తర్వాత ఆయన సికింద్రాబాద్ ఎంపీగా రెండుసార్లు విజయం సాధించారు. రెండుసార్లు అంబర్‌పేటలో అత్యధిక మెజార్టీ ఓట్లు ఆయనకు దక్కాయి. ఎంపీగా ఆయన విజయం సాధించడంలో ఈ నియోజకవర్గ ప్రజలు ప్రధాన భూమిక పోషించారు. అందుకే కిషన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో అంబర్‌పేటకు అధిక ప్రాధాన్యమిస్తూ కృతజ్ఞతాపూర్వకంగా ఉంటున్నారని స్థానిక పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

నగరాభివృద్ధి బాటలో...

నగర అభివృద్ధిలో కిషన్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన 'రిపోర్ట్ టు ద పీపుల్ ప్రజెంటేషన్' (ప్రజలకు నివేదిన)లో స్పష్టం చేశారని నాయకులు చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ.26,000 కోట్లు కేటాయింపు, మెట్రోకు రూ.1204 కోట్ల నిధులు కేటాయించడంలో కిషన్‌రెడ్డి కృషి ఉందంటున్నారు. వచ్చే ఏడాది నాటికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను శంషాబాద్ విమానాశ్రయం మాదిరిగా ఆధునీకీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 715 కోట్లతో పనులు ప్రారంభించిందని, అది పూర్తయితే నగరానికే తలమానికంగా స్టేషన్ నిలవనున్నదని చెబుతున్నారు. అలాగే హైదరాబాద్‌లో 1000 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీలో డైనమిక్ లేజర్ షో, సైఫాబాద్‌లో మింట్ మ్యూజియం ఏర్పాటు, గోల్కొండ కోటల చరిత్ర తెలిపేలా సౌండ్ అండ్ లైట్ షోలను అందుబాటులోకి తీసుకురావడం కీలకమంటున్నారు. కాచిగూడ, నాంపల్లి, బేగంపేట ఆధునీకీకరణ, ఎంఎంటీఎస్ ఫేజ్-11 పనులను పూర్తి, సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్‌సెంటర్ల ద్వారా నగరంలోని బస్తీ దవాఖానాల్లోమౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర చాలా ఉందంటున్నారు. ఉస్మానియా, గోల్కొండ కోట, చార్మినార్, ట్యాంక్‌బండ్ వైభవాన్ని ప్రతిబింబించేలా ఇల్యూమినేషన్, సౌండ్ అండ్ లైట్ షోలు అందుబాటులోకి తెచ్చినట్లు చెబుతున్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లింగయ్య, తదితరులు

పెరిక కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- తెలంగాణ పెరిక కుల రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య

రాంనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పెరిక కులస్థులు విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని తెలంగాణ పెరిక కుల రాష్ట్ర అధ్యక్షుడు ఎం. లింగయ్య అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెరిక కుల పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘం ఆధ్వర్యంలో పెరిక కుల సదస్సు, ప్రపంచ స్థాయి ఉచిత 25వ వివాహ వేదిక సంఘం కన్వీనర్ సుంకరి ఆనందం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య, నగర అధ్యక్షుడు బి. పరమేశ్‌లు హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పెరిక కులస్థులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తగిన వాటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పెరిక కులస్థుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి మనోహర్, విజయ్‌కుమార్, అన్ని రాష్ట్రాలకు చెందిన యువతీ, యువకులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లోని అంజుమన్ హాల్‌లో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని అంజుమన్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అక్తర్ అలీ ప్రారంభించారు. 300 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. బీపీ, ర్యాండం బ్లడ్ షుగర్, ఎలక్ట్రో కార్డియోగ్రాం పుల్మనరీ ఫంక్షన్ టెస్ట్, ఎముకల పరీక్షలు, గైనకాలజిస్ట్, కార్డియాలజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజుమన్ సొసైటీ కార్యదర్శులు దిల్బర్ హుస్సేన్, జమీల్ ఉద్దీన్, భోలక్‌పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీర్, నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మినాజ్ ఉద్దీన్, డాక్టర్లు ఇమ్రాన్‌ఖాన్, మోహినొద్దీన్, డాక్టర్ తస్నీమ్, రవిచంద్రా, సయ్యద్ అబ్దుల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో దోపిడీ

- **రూ. 14.5 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు**
- **లింక్‌లు పంపి లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే చాలంటూ బురిడీ**

హైదరాబాద్ సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన మహిళ నుంచి రూ. 14.5 లక్షలు దోచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన మహిళకు ఇటీవల టెలిగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. కేవలం గూగుల్ మ్యాప్‌లో మేం సూచించిన రెస్టారెంట్‌లను సబ్‌స్క్రైబ్, లైక్ చేస్తే చాలు.. డబ్బులు మీ ఖాతాలో వేస్తాం, పార్ట్‌టైమ్ జాబ్ చేసి డబ్బులు సంపాదించాలి అనుకునేవారు కింద ఇచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి, రిజిస్టర్ కావచ్చు అంటూ రాసి ఉంది. నిజమని నమ్మిన ఆమె వెంటనే లింక్‌ను క్లిక్ చేసింది. ఆ తర్వాత వారు చెప్పిన విధంగానే గూగుల్ మ్యాప్స్‌లో రెస్టారెంట్లకు లైక్‌లు కొట్టడం, రేటింగ్ ఇవ్వడం, వారు చెప్పిన యూట్యూబ్ చానల్స్ వీడియోలను చూసి సబ్‌స్క్రైబ్ చేశారు. అందుకు వారు ఆమె ఖాతాలో డబ్బులు వేశారు. ఇలా కొన్నిరోజులు నమ్మించిన నేరగాళ్లు ఆ తర్వాత మీరు ఆన్‌లైన్‌లో ఇన్వెస్టిమెంట్ చేస్తే ఆ డబ్బుతో తక్కువ సమయంలోనే అధిక లాభాలు సంపాదించవచ్చు అంటూ నమ్మించారు. పెద్ద మొత్తంలో లాభాలు వస్తున్నట్లు వర్చువల్‌గా చూపించారు. కానీ, డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. అప్పటికే బాధిత మహిళ రూ. 14.5 లక్షలు ఇన్వెస్టిమెంట్ చేసింది. అనుమానం వచ్చిన ఆమె సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పద్మశ్రీ మాలోతు సోములాల్ నాయక్ దంపతులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

యువత లక్ష్యంతో ముందుకు సాగాలి

- **పద్మశ్రీ అవార్డు గ్రహీత మాలోతు సోములాల్ నాయక్**

నల్లకుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామంలోని ఓ తండాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన తనకు పద్మశ్రీ పురస్కారం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని పద్మశ్రీ అవార్డు గ్రహీత మాలోతు సోములాల్ నాయక్ అన్నారు. ప్రస్తుతం యువత సరైన లక్ష్యం ఎంచుకొని దృఢ సంకల్పంతో ముందుకు సాగినట్లయితే ఏదైనా సాధించవచ్చని, అందుకు తానే నిదర్శనమన్నారు. ఆదివారం నల్లకుంటలో యాదాద్రి జిల్లా బొల్లేపల్లి జిల్లా ఉన్నత పాఠశాల 1977-78 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, సీనియర్ న్యాయవాది బాలకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో సోములాల్ నాయక్ దంపతులకు పూర్వ విద్యార్థులందరూ కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ బాల్య మిత్రుడు సోములాల్ నాయక్ సాహిత్యం, విద్యలో రాణించి పద్మశ్రీ పురస్కారం అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొల్లేపల్లి జిల్లా పరిషత్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు బాలకృష్ణయాదవ్, అయ్యన్నగౌడ్, జి. నర్సింహగౌడ్, పద్మారెడ్డి, ఉమ, సుమతి, హమీద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గెలిస్తే... కేంద్రంలో బెర్త్ పక్కా

(1వ పేజీ తరువాయి)

గెలుపొందిన శివశంకర్ 1980లో ఇందిరాగాంధీ ప్రభుత్వంలో కీలకమైన న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1984లో సికింద్రాబాద్ నుంచి గెలిచిన టంగుటూరి అంజయ్య రాజీవ్‌గాంధీ మంత్రి వర్గంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఇదే పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందిన బండారు దత్తాత్రేయ 1998 నుంచి 1999 వరకు వాజ్‌పేయి మంత్రి వర్గంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా.. 1999నుంచి 2001 వరకు వాజపేయి మంత్రి వర్గంలో పనిచేశారు. 2003లో బండారు అర్బన్ డెవలప్‌మెంట్ పోర్ట్ పోలియో ఇచ్చారు. 2014లో నరేంద్రమోదీ మంత్రి వర్గంలో కార్మి క, ఉపాధి శాఖ మంత్రిగా దత్తాత్రేయ పనిచేశారు. ఆ తర్వాత 2019, 2024లో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నుంచి గెలుపొందారు. 2019లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా, ఆ తర్వాత సాంస్కృతిక, పర్యాటక శాఖ, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. మళ్లీ ఇప్పుడు తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన కిషన్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి లభించింది.

జోరుగా చేపల విక్రయాలు

ముషీరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చేపల మార్కెట్ ఆదివారం చేపల కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం, మృగశిరకార్తి ప్రభావంతో మార్కెట్‌లో అమ్మకాలు సాయంత్రం వరకు కొనసాగాయి. వర్షాల ప్రభావంతో చేపల దిగుమతి మార్కెట్‌కు తక్కువగా రావడంతో వ్యాపారులు చేపల ధరలను విపరీతంగా పెంచారు. కొర్రమీను శనివారం కిలో రూ. 600 నుంచి 650కి విక్రయించగా ఆదివారం కిలో రూ.700లకు విక్రయించారు.